సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 17 । జూన్ । 2023



గరిష్ట స్థాయికి ఉష్ణతాపం

జిల్లాలో ఉష్ణతాపం రికార్డులు సృష్టిస్తోంది. మూడు వారాలుగా అధిక ఉష్ణోగ్రతల నమోదుతో మన్యం అట్టడుకుతోంది. 8లో



క్షతగాత్రులకు మెరుగైన సేవలు

వ్యాన్ బోల్తా ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎం హెచ్‌వో జమాల్ బాషా ఆదేశించారు. 8లో



వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

విద్యుత్ సరఫరా నిలిపివేతతో ఇబ్బందులు

గంగవరం : రంపచోడవరం 220/33 కేవీ విద్యుత్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గంగవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాల్లో , గ్రామ సచివాలయాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రభుత్వ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సెల్ నెట్‌వర్క్ కూడా సరిగ్గా పనిచేయలేదు. మండల కేంద్రమైన గంగవరంలో టవర్లు పనిచేయక పోవడంతో సెల్ వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. నెట్‌వర్క్ లేక స్థానిక స్టేట్ బ్యాంక్‌లో లావాదేవీలు జరగలేదు. ఖాతాదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

- జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్మోహనరావు

సాక్షి, పాడేరు: కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు మండల, జిల్లా స్థాయిలో అర్హుల ఎంపిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్మోహనరావు తెలిపారు. నాలుగవ తరగతిలో 40 సీట్లు (బాలురు 20, బాలికలు 20), ఐదవ తరగతిలో 11సీట్లు(బాలురు 7, బాలికలు 4) ఉన్నాయన్నారు. మండల క్రీడాభివృద్ధి అధికారుల ఆధ్వర్యంలో ఈనెల 20వతేదీ వరకు అర్హులైన విద్యార్థినీ విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఇక్కడ 8, అంతకన్నా ఎక్కువ పాయింట్లు సాధించిన వారిని జిల్లా స్థాయి ఎంపికకు పంపుతామన్నారు. ఈనెల 22, 23తేదీల్లో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో జిల్లా స్థాయి ఎంపికలు జరుగుతాయన్నారు. ఈ సీట్లకు దరఖాస్తు చేసే విధానం, వయసు నిబంధన లు, ఇతర వివరాలకు 9000274225లో సంప్రదించాలని ఆయన కోరారు.

గుండె పోటుతో ఉపాధ్యాయుడి మృతి

- విధి నిర్వహణలో తీవ్ర అస్వస్థత
- ఆస్పత్రికి తరలించినా దక్కని ప్రాణం



సింహాద్రి (ఫైల్)

చింతపల్లి రూరల్: మండలంలోని చౌడుపల్లికి చెందిన ఉపాధ్యాయుడు కొరాబు సింహాద్రి శుక్రవారం విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందారు. సీనియర్ ఉపాధ్యాయుడైన ఆయన ప్రస్తుతం స్థానిక బాలుర ఆశ్రమ పాఠశాల–2 ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం విధులకు హాజరైన కొద్దిసేపటికి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కళ్లు తిరిగి పడిపోవడంతో హుటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఉపాధ్యాయుడు సింహాద్రి మృతికి ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, ఉద్యోగ సంఘ ప్రతినిధులు ఉగ్రంగి గిరి, శశికుమార్ సంతాపం తెలిపారు.శనివారం ఆయన స్వగ్రామం చౌడుపల్లిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

జాబ్‌మేళాలో 89 మంది ఎంపిక

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. ట్రస్ట్ సర్వీసెస్, శ్రీరామ్‌చిట్స్, శరణ్‌మోటార్స్, జీ4 సెక్యూరిటీ, పాబ్లోట్రాన్స్‌పోర్ట్, దసపల్లా హోటల్స్, ఎస్‌బీఐ కార్డ్స్, ఆన్‌లైన్ గ్రోసరీ, అదానీ ఫౌండేషన్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీల్లో 355 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 169 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 89 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అభ్యర్థులకు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏ.సంగీత, ఆయా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

20న మెగా రక్తదాన శిబిరం

కొయ్యూరు: కొండగోకిరిలో ఈనెల 20న మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తోడు ట్రస్టు నిర్వాహకుడు మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. నర్సీపట్నం అమ్మ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉజ్వల మల్టీ రీచార్జ్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. అమ్మ ఆస్పత్రి వైద్యుడు జీవీ రాజు మాట్లాడుతూ సామాజిక కార్యకర్త లోకులగాంధీ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేస్తున్నామన్నారు. దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

ప్రాణాలను మింగేస్తున్న అతివేగం

ఏజెన్సీలో ప్రైవేట్ వాహనదారులు ఏమాత్రం నిబంధనలు పట్టించుకోవడం లేదు. లగేజీ తరలించే వాహనాలను ప్రయాణికుల ట్రాన్స్‌పోర్టుకు ఉపయోగిస్తున్నారు. కొన్నిచోట్ల నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను ఎక్కించి అతివేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. వారి ఆర్జన మాట ఎలా ఉన్నా ప్రమాదానికి దారితీసిన సందర్భాల్లో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

- పరిమితికి మించి ప్రయాణికుల తరలింపు
- అదుపు తప్పుతున్న వాహనాలు
- నిబంధనలకు విరుద్ధంగా లగేజీ ట్రాన్స్‌పోర్టు వాహనాల వినియోగం
- పోలీసులు హెచ్చరిస్తున్నా మారని ప్రైవేట్ తీరు



కొయ్యూరు- పోతవరం మార్గంలో ఆటోపై వేలాడుతున్న ప్రయాణికులు



మారేడుమిల్లి ప్రాంతంలో పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న జీపు

కొయ్యూరు: పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా పెను ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. మండలంలో గురువారం పోతవరం నుంచి ఎం.భీమవరం వస్తున్న వ్యాన్ అదుపు తప్పడంతో సంఘటన స్థలంలో ముగ్గురు మృతి చెందారు. 20 మంది గాయపడ్డారు. వీరిలో కొంతమంది ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ఇలాంటి దుర్ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. పరిమితికి మించిన ప్రయాణికులతో అతివేగంగా వెళ్లడమేనని కారణమని పోలీసులు చెబుతున్నారు. వారు ఎన్ని హెచ్చరికలు చేసినా ప్రైవేట్ వాహనదారుల్లో ఏమాత్రం మార్పు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

పోతవరం– ఎం.భీమవరం ఘటనలో..

- పోతవరం– ఎం.భీమవరం మార్గంలో జరిగిన వ్యాన్ బోల్తా ఘటనలో నిబంధనలు ఉల్లంఘన కనిపిస్తోంది. ఈ వాహనాన్ని ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్టుకు ఉపయోగించ కూడదు. అత్యవసర పరిస్థితుల్లో ఎక్కించినా 10 నుంచి 15 మంది మాత్రమే ఉండాలి. అందుకు విరుద్ధంగా సుమారు 28 మంది వరకు ఉన్నారు. వీరిలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా దాదాపుగా మిగతా వారంతో గాయాలపాలయ్యారు.
- ఈ మార్గంలో రోడ్డు నిర్మించి ఆరేళ్లు కావస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే సంత కావడంతో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోవడమే వాహనం అదుపు తప్పడానికి కారణమైంది.
- గతేడాది జనవరిలో బూదరాళ్ల రహదారిలో అతివేగం వల్ల జీపు అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది.ఈ ప్రమాదంలో చింతవానిపాలెంకు చెందిన ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు.
- రెండు రోజుల క్రితం శరభన్నపాలెం–ఎర్రబొమ్మాళి రహదారిలో పరిమితికి మించి ప్రయాణికులతో వస్తున్న ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు.
- 2021 సెప్టెంబర్‌లో అతివేగంతో వస్తున్న బైక్ అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు సంఘటన స్థలంలోనే మృతి చెందారు.
- 2020 జూన్ నెలలో అతివేగంతో వస్తున్న రెండు బైక్‌లు గింజర్తి జంక్షన్ వద్ద ఢీకొనడంతో రాజేంద్ర పాలెం, ఎం.మాకవరం గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందారు.

మారుమూల కావడంతో..

- ఏజెన్సీలో మారుమూల గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం పూర్తిస్థాయిలో అందుబాటులో రాలేదు. అందువల్ల మారుమూల గ్రామాల ప్రజలు ఏ అవసరం వచ్చినా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిందే. అందువల్ల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణానికి డిమాండ్ కూడా ఉంటుంది. దీనిని ఆసరాగా తీసుకుని ఆదాయం సముపార్జనే ధ్యేయంగా పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కిస్తున్నారు. అతివేగంతో నడిపి ప్రమాదాలకు గురవుతున్నారు.
- మారుమూల ప్రాంతాలకు కావడంతో పోలీసులు పర్యవేక్షణ ఉండదన్న ధీమాతో ప్రైవేట్ వాహనాల డ్రైవర్లు ఇష్టానుసారంగా నడుపుతున్నారు. మారుమూల గ్రామాల రహదారులన్నీ దాదాపుగా ఇరుకైన మలుపులతో ఉంటాయి. ప్రైవేట్ వాహనాల డ్రైవర్లలో చాలామందికి లైసెన్సులు లేవు. దీనివల్ల ప్రమాదం జరిగిన సందర్భంలో బీమా సౌకర్యం తోపాటు నష్టపరిహారాన్ని మృతుల కుటుంబాలు కోల్పోతున్నాయి.

బ్రేక్‌లు ఫెయిల్ వల్లే ప్రమాదం



పోతవరం– ఎం.భీమవరం మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ బ్రేక్‌లు ఫెయిల్ అయ్యాయి. అందువల్లనే అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటాం. దీనిపై ఇప్పటికే చాలా సందర్భాల్లో అవగాహన కల్పించాం. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే చర్యలు తీసుకుంటాం. గతంలో ఇటువంటి వారికి తామే లైసెన్సులు చేయించాం.

– స్వామినాయుడు, సీఐ, కొయ్యూరు

విషాదం నింపిన ప్రేమ

- తీరని వేదన మిగిల్చిన ప్రేమజంట ఆత్మహత్య
- శోకంలో తాడిగుడ, సీమగెడ్డ



భార్య రొద్దు, కుమార్తెతో చంద్రన్న (ఫైల్)



తాడిగుడ గ్రామంలో రోదిస్తున్న చంద్రన్న కుటుంబ సభ్యులు

అనంతగిరి: ప్రేమ వ్యవహారం రెండు కుటుంబాల్లో తీరని శోకం నింపింది. మండలంలోని తాడిగుడ గ్రామానికి చెందిన చంద్రన్న (33) సీమగెడ్డ గ్రామానికి చెందిన స్వాతి (17) ఆత్మహత్యకు పాల్పడటంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరిద్దరు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం నిమ్మలపాలెం గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. తాడిగుడ గ్రామానికి చెందిన చంద్రన్నకు పదిహేనేళ్ల క్రితం రొద్దు అనే గిరిజన మహిళతో వివాహం జరిగింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో చంద్రన్న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న వాలాసి పంచాయతీ సీమగెడ్డ గ్రామానికి చెందిన స్వాతితో గత కొంతకాలంగా ప్రేమ వ్యవహారం సాగిస్తున్నాడు. అయితే రెండో వివాహం చేసుకునేందుకు భార్య రొద్దు అంగీకరించకపోవడంతో భార్యాభర్తలు గొడవపడుతున్నారు. ఈ కారణంగా చంద్రన్న స్వాతితో కలిసి ఉంటున్నాడని బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం కొత్తవలస మండలం రైల్వే ట్రాక్ వద్ద చంద్రన్న, స్వాతి ఆత్మహత్య చేసుకున్నట్టు కొత్తవలస పోలీసులనుంచి సమాచారం అందడంతో ఇరు కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. చంద్రన్న భార్య గృహిణి. వ్యవసాయం చేసుకుంటూ సాఫీగా సాగిపోతున్న ఆ కుటుంబంలో ప్రేమ వ్యవహారం చిచ్చురేపింది. ఆత్మహత్యకు దారి తీయడంతో చంద్రన్న కుటుంబం యజమానిని కోల్పోయింది. భార్య రొద్దు, పిల్లలు కుమార్, సునీల్, సుమిత్ర, దీప్తి అనాథలకుగా మిగిలిపోయారు. వారంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అసైన్‌మెంట్ భూ పంపిణీకి ఏర్పాట్లు

- జూలై నాటికి సిద్ధం చేయాలి
- విధుల్లో నిర్లక్ష్యం చేస్తే తొలగింపు తప్పదు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లావ్యాప్తంగా అసైన్‌మెంట్ భూ పంపిణీకి సంబంధించి జూలై నాటికి ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.శుక్రవారం ఆయన తహసీల్దార్లు,అటవీశాఖ అధికారులు,సర్వేయర్లు,వీఆర్వోలతో నిర్వహించిన వీడియో సమావేశంలో పలు సూచనలు చేశారు. గ్రామసభలు నిర్వహించి, అసైన్‌మెంట్ భూములకు లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ చేసి, సాంకేతిక సమస్యలను సరిచేయాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జిల్లాలో 2,550 ఎకరాల అసైన్‌మెంట్ భూముల పంపిణీకి ఇటీవల ఆదేశించారని వివరించారు. వీఆర్వోలు తప్పనిసరిగా గ్రామసచివాలయాల్లోనే పనిచేయాలని, అవసరమైతేనే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలని సూచించారు. విధులను సక్రమంగా నిర్వహించని వారిని తొలగించే అధికారం కూడా తమకు ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. విధి నిర్వహణలో చీటింగ్‌కు పాల్పడితే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. తహసీల్దారులంతా వీఆర్వోల రోజువారి హాజరు వివరాలు, సచివాలయానికి వెళ్లిన సమయం, మళ్లీ బయటకు వెళ్లిన సమయం వివరాలను తప్పనిసరిగా పంపించాలన్నారు.తమ తనిఖీలలో నిధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు నిర్ధారణ అయితే అక్కడికక్కడే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే తహసీల్దార్లకు కూడా నోటీసులు జారీ చేస్తామని, మూడు నోటీసుల తరువాత వారిపై కూడా శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వీఆర్వోలతో తరచూ సమావేశాలు నిర్వహించి తగిన సూచనలు ఇవ్వాలని,అవసరమైతే ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లకు సూచించారు. జిల్లాలో 2,265 సెల్‌టవర్ల నిర్మాణాలకు చర్యలు తీసుకున్నామని,గురువారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో జిల్లాలో 85 సెల్‌టవర్లు ప్రారంభించారని, ఇందుకు సహకరించిన వారందరికి సీఎం కృతజ్ఞతలు తెలియజేశారన్నారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన సెల్‌టవర్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు స్థలాలను కేటాయించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవోలు సూరజ్ గనోరే, అభిషేక్, సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్, సర్వే భూ రికార్డుల ఏడీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

20న పాడేరులో జాబ్ మేళా

పోస్టర్ ఆవిష్కరణ




జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్,ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ,ఇతర అధికారులు

సాక్షి, పాడేరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20వతేదీన పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. మెగా జాబ్‌మేళాకు సంబంధించి ప్రచార పోస్టర్లను శుక్రవారం ఐటీడీఏలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్టు,ఫెయిర్ ఫీల్డ్ మారియోట్,అపోలో ఫార్మసీ, కేర్ ఫర్ యూ, మోహన్ స్పిన్టెక్స్ ఇండియా, డెక్కన్ కెమికల్ ప్రయివేట్ లిమిటెడ్, అరబిందో, ముత్తూట్ ఫైనాన్స్, టీమ్‌లీజ్(యూనియన్ బ్యాంకు,ఎస్‌బీఐ)వైఎస్‌కే ఇన్ఫోటెక్, పేటీఎం, కాగ్నెస్ట్ ఈసర్వీసెస్ సంస్థలు ఈ జాబ్‌మేళాకు హాజరవుతున్నాయన్నారు. టెన్త్ నుంచి డిగ్రీ వరకు చదివిన యువతీ,యువకులతో పాటు ఐటీఐ, టీఎస్సీ, ఫార్మసీ, ఇంజినీరింగ్, ఎంబీఏ చదివిన అభ్యర్థులంతా ఈ జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగాలు సాధించాలని వారు కోరారు.మరిన్ని వివరాలకు నవీన్ను 9491786463 నంబరులో సంప్రదించాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఎస్‌డీసీ శర్మ, ఐటీడీఏ ఏపీవో ప్రభాకర్, డీఆర్‌డీఏ పీడీ మురళీ, జిల్లా కల్చరాధికారి సంగీత, డీఎస్‌డీవో జి.ప్రశాంత్‌కుమార్, డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు వినతుల వెల్లువ

కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన స్పందనలో ప్రజలనుంచి 135 వినతులు స్వీకరించారు. వీటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ట్రైనీ కలెక్టర్ శ్రీవాత్సవ, ఐటీడీఏ ఏపీవో ప్రభాకర్, గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- అటవీ భూములకు పట్టాలు మంజూరు చేయాలని పాడేరు మండలం బడిమెల పంచాయతీ,బడిమెల కాలనీకి చెందిన కొర్రా వరలక్ష్మి,మజ్జి రత్నాలమ్మ,డుంబ్రిగుడ మండలం తోటవలస గ్రామానికి చెందిన భాగ్యవతి,అర్జున్‌తో పాటు మరో 20మంది విన్నవించుకున్నారు
- తియ్యమామిడి నుంచి మెట్టపాడుకు రోడ్డు నిర్మించాలని జి.మాడుగుల మండలం పెదలోచలి పంచాయతీ మెట్టపాడు గ్రామానికి చెందిన జగ్గారావు,మహేష్ కోరారు
- సీతబంద నుంచి నిట్టమామిడి గ్రామం వరకు ఐదు కిలోమీటర్ల మేర రోడ్డు మంజూరు చేయాలని జి.మాడుగుల మండలం గడుతూరు సర్పంచ్ అప్పలమ్మ విన్నవించారు
- కొయ్యూరు మండలంలోని బూదరాళ్ల పంచాయతీ,క్రూనురు గ్రామంలోని రెండు పీవీటీజీ,భగత వీధులను అనుసంధానం చేస్తూ రోడ్డు నిర్మించాలని వార్డు సభ్యులు సంజీవరావు,రాజేష్ వినతిపత్రం అందజేశారు.
- కొయ్యూరు మండలం మూలపేట పంచాయతీ కుమ్మర్ల, జాజులబంద, ధారగెడ్డ, పాలమామిడి, పార్లబంద గ్రామాలకు రోడ్డు సదుపాయం కల్పించాలని గిరిజనులు రంగా, శ్రీనివాసరావు, సుబ్బారావు కోరారు

డ్రోన్ టెక్నాలజీలో ఉపాధి అవకాశాలు

మురళీనగర్: విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీ శిక్షణ ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవచ్చని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు అన్నారు. ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈ టెక్నాలజీపై కాలేజీ వివిధ బ్రాంచీల డిపార్టుమెంట్ హెడ్‌లకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సులో చేరడానికి ఆసక్తి చూపే విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీలో సర్టిఫికెట్ కోర్సులు నిర్వహించడానికి ఏయూ ఐసీడీటీ ముందుకు వచ్చినట్లు చెప్పారు. దీనిపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తామని ఐఎస్‌టీడీ సీఈవో ఎస్‌కే వెంకటసతీష్, చైర్మన్ వోఎంరావ్ చెప్పారు. కార్యక్రమంలో వివిధ డిపార్టుమెంటు హెడ్‌లు పాల్గొన్నారు.

సంప్రదాయేతర కోర్సులతో ఉపాధి అవకాశాలు

మురళీనగర్ (విశాఖపట్నం): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంప్రదాయేతర కోర్సులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఏయూ ఐసీడీటీ ఇన్నోవేషన్ కేంద్రం సీనియర్ వైస్ చైర్మన్ డాక్టర్ ఓఎంరావ్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీలో నిర్వహించిన డిపార్టుహెడ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నోవేటివ్ కోర్సులపై విద్యార్థులు అవగాహన కల్పించి శిక్షణ కార్యక్రమాలు అందించేందుకు ఏయూ ఐసీడీటీ కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.

గోస్తనీపై సాహస ప్రయాణం



రెండు కొండల నడుమ లోయలో ప్రవహిస్తున్న జీవ నది గోస్తని



బొర్రా గుహల వద్ద నిర్మిస్తున్న జిప్‌లైన్

- రూ.35 లక్షలతో జిప్ లైన్ ఏర్పాటుచేస్తున్న పర్యాటకశాఖ
- చురుగ్గా నిర్మాణ పనులు
- కొద్దిరోజుల్లో అందుబాటులోకి వచ్చేలా చర్యలు

విశ్వవ్యాప్తి పొందిన బొర్రా గుహల వద్ద జీవనది అయిన గోస్తనీ అందాలను తిలకించే భాగ్యం పర్యాటకులకు త్వరలోనే అందుబాటులోకి రానుంది. పర్యాటకులు రెండు కొండల మధ్య విహరిస్తూ ఈ అందాలను తిలకించేలా త్వరలోనే జిప్‌లైన్ అందుబాటులోకి తెచ్చేందుకు పర్యాటకశాఖ కసరత్తు చేపట్టింది. దీనిలో భాగంగా చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి.

అనంతగిరి: మన్యంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో బొర్రాగుహలు ఒకటి.. సహజసిద్ధంగా ఏర్పడిన బొర్రా అందాలకు పర్యాటకులు, ప్రముఖులు సైతం ఫిదా అవ్వాల్సిందే.. గుహలను తిలకించేందుకు, దేశవిదేశాలతో పాటుగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తుంటారు. గుహల్లో పర్యాటకులు సేదతీరుతున్న ప్రదేశాన్ని ఆనుకున్న ఉన్న లోయలోనే గోస్తనీ నది ప్రవహిస్తుంది. ఎటుచూసినా పచ్చదనం, పాలరాతిని తలపించే కాల్సైట్ శిలలపైనుంచి ప్రవాహం మంత్రముగ్ధుల్ని చేస్తుంది. అత్యంతలోతులో ఉన్నందున దూరం నుంచి మాత్రమే పర్యాటకులు తిలకించగలుగుతున్నారు. దూరం నుంచి ఫొటోలు, సెల్ఫీలు తీసుకుని పరవశిస్తుంటారు. పర్యాటకశాఖ ఏర్పాటుచేస్తున్న జిప్‌లైన్ వల్ల రెండు కొండల మధ్య విహరిస్తూ ఎటుచూసినా పచ్చదనాన్ని, గోస్తని అందాలను అతి దగ్గరలోంచి తిలకించవచ్చు.

శరవేగంగా పనులు

జిప్‌లైన్ ప్రాజెక్టు పనులు చురుగ్గా జరుగున్నాయి. ఇప్పటివరకు 25 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్ట్‌కు పర్యాటక శాఖ రూ.35 లక్షలు వెచ్చించింది. ఈ నిధులతో జిప్‌లైన్‌కు సంబంధించి ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగానే బొర్రా గుహలు ముఖద్వారం వద్ద ఐరన్ గ్రిల్స్ ఏర్పాటుచేస్తున్నారు.

గోస్తనీకి ఎంతో ప్రత్యేకత

బొర్రాగుహలను ఆనుకుని పచ్చని కొండలను ఆనుకొని లోయలో ప్రవహిస్తున్న గోస్తనీ నదికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సుదూర ప్రాంతం నుంచి కాల్సైట్ బండరాళ్లపై నుంచి గోస్తనీ నది ప్రవహిస్తుండడంతో నీరు తెల్లగా అందంగా కనిపిస్తుంది. ఈ అందాలను తిలకించేందుకు లోయలోకి వెళ్లిన వారిలో చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారు. కొంతమంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి.

ప్రకృతి అందాలతో మమేకమయ్యేలా..

పర్యాటకులు ప్రకృతి అందాలతో మమేకమయ్యేలా జిప్‌లైన్ ప్రయాణం సాగుతుంది. రెండు కొండల మధ్య హరిత శోభను ఆస్వాదించవచ్చు. అందుబాటులోకి రానున్న ఈ సౌకర్యం పర్యాటకులకు మరపురాని మధురానుభూతిని ఇస్తుందని పర్యాటకశాఖ భావిస్తోంది.

కాల్సైట్ ప్రత్యేకత ఇదీ..

గోస్తనీ నదిలో ఉన్న కాల్సైట్ శిలలకు నీటిలో కరిగే గుణం ఉంది. అయితే సాధారణ నీరు దీనిని కరిగించలేదు. కానీ అదే నీరు వాతావరణంలోని కార్బన్ డైఆక్సైడ్‌తో సహా కలిసి కార్బొనిక్ ఆమ్లంగా మారి కాల్సైట్‌తో రసాయన క్రమక్షయం జరిపి అందులోని కార్బొనేట్‌లను నీటిలో సులువుగా కరిగిపోయే బై కార్బొనేట్‌లుగా మార్చుతుందని నిపుణులు తెలిపారు.

త్వరితగతిన పూర్తిచేస్తాం



ప్రకృతి అందాల్లో పర్యాటకులు ప్రయాణించేలా జిప్‌లైన్ ప్రాజెక్టును అందుబాటులోకి తెస్తున్నాం. జిప్‌లైన్‌కు సంబంధించి బొర్రా గుహల వైపు ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. ఇవి పూర్తయిన వెంటనే కొయిటిగుడ వైపు పనులు చేపడతాం. దాదాపుగా నెలరోజుల వ్యవధిలో జిప్‌లైన్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

– శ్రీనివాస్ పాణి, రీజనల్ డైరెక్టర్, విశాఖపట్నం

క్షతగాత్రులకు మెరుగైన సేవలు

- డీఎంహెచ్‌వో ఆదేశం

రంపచోడవరం: కొయ్యూరు మండలం మఠంభీమవరంలో గురువారం జరిగిన వ్యాన్ బోల్తా ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జమాల్ బాషా ఆదేశించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగ్రాతులను శుక్రవారం ఆయన పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి క్షతగ్రాతులకు అందించిన చికిత్స వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో వైద్యులతో సమావేశమయ్యారు. ప్రమాదంలో గాయపడిన వారు పూర్తిగా కోలుకున్న తరువాత డిశ్చార్జి చేయాలని సూచించారు. క్షతగాత్రులు అందించిన సేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మి డీఎంహెచ్‌వోకు వివరించారు. సకాలంలో వైద్యం అందించామని ఆమె పేర్కొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు టీఎల్‌ఎం కిట్లు

సాక్షి, పాడేరు: పేద, దివ్యాంగ చిన్నారులకు ఎన్‌ఐఈపీఐడీ సంస్థ అందుబాటులోకి తెచ్చిన టీఎల్‌ఎం కిట్‌లను శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. 22 మండలాల పరిధిలోని ప్రత్యేక అవసరాల చిన్నారులు, వారి తల్లిదండ్రులంతా హాజరయ్యారు. మొత్తం 62 మంది దివ్యాంగ చిన్నారులకు టీఎల్‌ఎం కిట్లు పంపిణీ చేయడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఏఎంవో భాస్కర రావు, కో–ఆర్డినేటర్లు జి.రామాంజులు, మల్లికార్జుననాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోమొబైల్ షాపులో చోరీ

ఎస్.రాయవరం: అడ్డురోడ్డులోని ఓ ఆటోమొబైల్ షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గెడ్డపాలెం గ్రామానికి చెందిన దేవ రవికి అడ్డురోడ్డులో ఆటోమొబైల్ షాపు ఉంది. గురువారం అర్ధరాత్రి షాపులోకి దొంగలు చొరబడి రూ.1.20 లక్ష నగదు, ల్యాప్‌టాప్, నాలుగు ఫోన్లు చోరీ చేశారు. శుక్రవారం ఉదయం షాపునకు వచ్చిన రవి చోరీ జరిగినట్టు గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పన

- చిన్న పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం
- బ్యాంకుల నుంచి రుణాలు

జి.మాడుగుల: స్వయం ఉపాధి కోసం చిన్న పరిశ్రమలు ఏర్పాటును ప్రొత్సాహించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని వైఎస్సార్‌క్రాంతిపథం ఏపీఎం సుందరమ్మ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆమె శుక్రవారం మాట్లాడుతూ మండలంలో 21 నుంచి 50 సంవత్సరాలు మధ్య వయస్సు గల నిరుద్యోగులు యువతీ యువకులు, మహిళా శక్తి సంఘాల్లో సభ్యులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో సభ్యులు, గ్రామీణ హస్త కళాకారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికై న వారికి లక్ష రూపాయల నుంచి రూ.10లక్షల వరకు పెట్టుబడి గల యూనిట్లు ఏర్పాటు చేస్తారన్నారు. ఇందులో భాగంగా ఒక్కో యూనిట్ మండలంలో 20 నుంచి 25 మందిని ఈ నెల 20లోగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం , పాస్‌పోర్టు సైజు ఫోటో, విదార్హత ధ్రువపత్రాలు, బ్యాంక్ ఖాతా పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో 25మంది వివరాల ఫార్మాట్ ఆధార్‌కార్డు ప్రకారం 9490712046 వాట్సాప్ ద్వారా సమర్పించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు కౌన్సిలింగ్, అవగాహన కార్యక్రమం ఉంటుందని, జూలై 1 నుండి 15వ తేదీ వరకు యూనిట్ ఎంపిక చేసుకున్న అభ్యర్థులకు వివిధ పథకాల కింద డాక్యుమెంటేషన్ ప్రక్రియ, ఈడీపీ శిక్షణ కార్యక్రమాలు, జూలై 20 నుంచి బ్యాంకర్లుతో సమావేశం, అభ్యర్థులకు రుణాలు మంజూరు ప్రక్రియ జరుగుతుందన్నారు. మరెన్ని వివరాలకు డీఆర్‌డీఏ పీడీ 9491030588, ఎల్‌డీఎం–8919728227, జిల్లా పరిశ్రమ కేంద్రం ఏడీ –9704249444,మెప్మా(సిడ్బి) పీవో – 9490712046 నంబర్‌లకు సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.



చింతపల్లి సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

అడ్డతీగల: స్వయం ఉపాధి కల్పనలో భాగంగా చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సహించే కార్యక్రమానికిగాను అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీఓ కె.బాపన్నదొర తెలిపారు. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి స్వయం ఉపాధి కోసం చిన్న పరిశ్రమల స్థాపనకు ఎంపీడీవో, డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతిపథం మండల ప్రాజెక్ట్ మేనేజర్లు సమన్వయంతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను గుర్తించి ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయన్నారు. స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఇప్పటికే మండలవ్యాప్తంగా 66 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమం ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకూ ఉంటుందన్నారు.



అడ్డతీగల ఎంపీడీవో కె.బాపన్నదొర

చింతపల్లిరూరల్: గిరిజన నిరుద్యోగ యువకులు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోడానికి ప్రభుత్వ అందిస్తున్న సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. మండల పరిషత్ కార్యలయంలో నిరుద్యోగ యువతతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత చిన్న పాటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకోని మరింత మందికి ఉపాధి కల్పించాలన్నారు. లక్ష రూపాయల నుంచి పది లక్షల వరకు రుణ సదుపాయం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ప్రస్తుతానికి చింతపల్లి మండలానికి 25 యూనిట్లు మంజూరయ్యాయని, మరి కొన్ని యూనిట్లు మంజూరుకు పై అధికారులతో చర్చిస్తామన్నారు. ఎంపీడీవో ఆశాజ్యోతి, వెలుగు ఏపీఎం అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణతో అధిక దిగుబడి



వ్యవసాయ పరికరాలను రైతులకు అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయడు
- జి.అగ్రహారంలో వ్యవసాయ పనిముట్లు పంపిణీ

మాడుగుల రూరల్ : వ్యవసాయ సాగులో ఆధునిక యంత్రాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన పథకం(పీఎంకేఎస్‌వై)లో భాగంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డీడబ్ల్యూఎంఏ) ఆధ్వర్యంలో జి.అగ్రహారం గ్రామంలో శుక్రవారం రైతులకు వ్యవసాయ సంబంధిత పనిముట్లను పంపిణీ చేశారు. డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఇ.సందీప్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వ్యవసాయం అంటే పండగ అని చాటి చెప్పి, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతన్నకు అందిస్తున్న సేవలను వివరించారు. గొలుగొండ మండలానికి చెందిన రైతులకు ఆయిల్ ఇంజిన్లు, తార్పన్లు, పైపులు, డ్రమ్‌సెట్లు, స్ప్రేయర్లను అందించారు. పీడీ సందీప్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం, బీసీ రైతులకు 80 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందిస్తున్నామన్నారు. జిల్లాలోని రెండు మండలాల్లో ఈ పనిముట్ల పంపిణీ జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీడీ శ్రీనివాసరావు, స్థానిక ఏపీవో నవర వరహాల బాబు, టెక్నికల్ సహాయకులు దాడి జగదీష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

అంధ బాలికల పాఠశాలలో ప్రవేశాలు

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రిన్సిపాల్ ఎం.మహేశ్వరరెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల వయసు ఉండి.. కనీసం 40 శాతం అంధత్వం గల బాలికలు అర్హులన్నారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు 46 సీట్లను భర్తీకి చేస్తామని తెలిపారు. ఉచిత వసతి, పౌష్టికాహారం, ఆధునిక బ్రెయిలీ సామగ్రితో విద్య, కంప్యూటర్ పరిజ్ఞానంతో ప్రత్యేక శిక్షణ ఉంటుందని, వివరాలకు 90144 56753, 77805 24716ను సంప్రదించాలని కోరారు.

మరణించినా.. అతని చూపు సజీవం



భాస్కరరావు కార్నియాను సేకరిస్తున్న వైద్యుడు

మల్కాపురం: తను మరణించినా.. తన కళ్లు మరొకరిలో వెలుగులు నింపాలని భావించాడు. ఆయన ఆకాంక్షను కుటుంబ సభ్యులు నెరవేర్చారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన వై.భాస్కరరావు దుస్తుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా.. భాస్కరరావుకు గురువారం గుండెలో నొప్పి రావడంతో గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించాలని సూచించారు. వెంటనే కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మరణం అనంతరం తన కళ్లను దానం చేయాలని భాస్కరరావు కుటుంబ సభ్యులకు సూచించారు. ఆయన కోరికను వారు నెరవేర్చారు. సమాచారం అందుకున్న జిల్లా అంధత్వ నివారణ సంఘం ప్రతినిధులు భాస్కరరావు కార్నియాను సేకరించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ఎంపీపీ బడుగు రమేష్

కొయ్యూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎంపీపీ బడుగు రమేష్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రమాదంలో గాయపడి రంపచోడవరంలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన శుక్రవారం పరామర్శించారు. అనంతరం మృతదేహాలకు పోస్టుమార్టం ప్రక్రియను పర్యవేక్షించి, మృతదేహాలను స్వగ్రామాలైన డబ్బకోట, చీడికోటకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. ప్రమాదం జరిగిన అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి వారిని ఆస్పత్రులకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సరుకుల కొనుగోలుకు పోతవరం సంతకు వెళ్లిన వారు తిరిగిరాని లోకాలకు వెళ్లడం చాలా బాధాకరమన్నారు. ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. యూ.చీడిపాలెం ఎంపీటీసీ తమర్బ మాధవరావు, సర్పంచ్ దడాల రమేష్ తదితరులున్నారు.



చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్, పక్కన సీఐ స్వామినాయుడు, ఎంపీటీసీ, సర్పంచ్ తదితరులు

ప్రమాద విషయం తెలియగానే కొయ్యూరు సీఐ స్వామినాయుడు,మంప ఎస్‌ఐ లోకేష్ గురువారం రాత్రి నుంచి రంపచోడవరంలో ఉన్నారు.క్షతగాత్రులను పరామర్శించి. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు.

చివరి దశకు రైల్వే ట్రాక్ మరమ్మతులు

అనకాపల్లి టౌన్: రాజుపాలెం రైల్వేగేటు సమీపంలో ట్రాక్ మరమ్మతు పనులు కొలిక్కివస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున గూడ్స్ రైలు పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. విశాఖ నుంచి విజయవాడ వెళ్లే ట్రాక్‌లో ఈ ఘటన జరిగింది. మరమ్మతులు చేయడంతో ఈ ట్రాక్‌పై నుంచి శుక్రవారం నెమ్మదిగా రైళ్ల రాకపోకలు ప్రారంభించాయి. రాజుపాలెం రైల్వేగేటు నుంచి తాడి రైల్వే స్టేషన్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర 100మంది సిబ్బందితో 10 జేసీబీలు, ఒక 200 జేసీబీ మిషన్‌తో పనులు చేస్తున్నారు. శనివారం ఉదయానికి పనులు పూర్తవుతాయని రైల్వే ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.



ఎ–ట్రాక్ బాగు చేయడంతో యథావిధిగా ప్రయాణిస్తున్న గూడ్స్ రైలు

అగ్నికి ఆహుతైన జీడిమామిడి తోట

మునగపాక: టి.సిరసపల్లి సర్వే నంబర్ 138, 139లో జీడిమామిడి తోట అగ్నికి ఆహుతైంది. సంబంధిత భూములను ఏపీఐఐసీకి ప్రభుత్వం కేటాయించిన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం అకస్మాత్తుగా చెట్లకు మంటలంటుకున్నాయి. స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న అనకాపల్లి అగ్నిమాపక శాఖ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు. విషయాన్ని తహసీల్దార్ పి.ప్రకాషరావు దృష్టికి వెంకటాపురం మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ తీసుకువెళ్లారు. 30 నుంచి 32 ఎకరాల వరకు జీడి చెట్లు కాలిపోయినట్లు సమాచారం.

నైపుణ్యాభివృద్ధి సంస్థ నోడల్ ఆఫీసర్‌గా వెంకటరమణ



మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ విశాఖ జిల్లా నోడల్ ఆఫీసర్‌గా కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ నియమితులయ్యారు. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ డిప్లమో కాలేజీలు, ఐటీఐ, స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీల్లో విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సంబంధించి కార్యక్రమాలను పర్యవేక్షించడానికి టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖ తరపున ఆయన్ని జిల్లా నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. ఈ మేరకు టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నోడల్ ఆఫీసర్ల బృందంలో డీటీఈ, డీఈటీ, ఏపీఎస్ఎస్‌డీసీ, సీడ్‌ఏపీ, నేక్(ఎన్ఏసీ)ల నుంచి ఒక్కొక్కరు చొప్పున సభ్యులుగా ఉంటారు. ఇలా ప్రతి జిల్లాకు ఓ నోడల్ ఆఫీసర్ల బృందం పనిచేస్తుంది. వీరందరూ సమన్వయంగా పనిచేస్తూ రాష్ట్రంలోని 87 ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలు, 84 ఐటీఐలు, 26 నైపుణ్యాభివృద్ధి కళాశాలల్లో నిర్వహించే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు.

గరిష్ట స్థాయికి ఉష్ణతాపం

- 'ఫ్రై'డేగా మారిన ఫ్రైడే
- వడగాడ్పులకు అల్లాడిన జనం

సాక్షి, విశాఖపట్నం: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉష్ణతాపం రికార్డులు సృష్టిస్తోంది. మూడు వారాల పైనుంచి అట్టుడుకుతోంది. జనం వర్షాల కోసం తపిస్తున్న తరుణంలో నిప్పుల వాన కురుస్తోంది. శుక్రవారం తీవ్రరూపం దాల్చి ఫ్రైడే 'ఫ్రై' డేగా మారింది. జిల్లాలో 42 నుంచి 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదై జనాన్ని బేజారెత్తించాయి. ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపాడు. మధ్యాహ్నానికి మరింత తీవ్రరూపం దాల్చడంతో కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు వీచాయి. రాత్రి ఏడు గంటలు దాటినా వాతావరణం చల్లబడకుండా వేడి గాలులు కొనసాగుతూనే ఉన్నాయి.

శుక్రవారం జిల్లాలోని కూనవరం మండలం కొండయ్యగూడెం 42.79 డిగ్రీలు, చింతూరు మండలంలోని ఎర్రంపేటలో 42.54 డిగ్రీలు, అడ్డతీగలలో 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నేడు మరింత తీవ్రం

మరోవైపు శనివారం ఉష్ణోగ్రతలు మరింత ఉగ్రరూపం దాల్చనున్నాయి. ఫలితంగా పలుచోట్ల వడగాడ్పులు, కొన్ని చోట్ల తీవ్ర వడగాడ్పులు, అక్కడక్కడ అత్యంత తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. అందువల్ల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, నీరు, ద్రవ పదార్థాలు ఎక్కువగా సేవించాలని సూచించింది. మరో మూడు రోజులు వడగాడ్పుల ప్రభావం ఉంటుందని తెలిపింది.

భూ తగాదాలతోనే రమణ హత్య

- సీఐ నారాయణరావు వెల్లడి
- నిందితుడు అరెస్టు

నక్కపల్లి: భూ తగాదాల కారణంగానే పెద తీనార్లలో కారే రమణ అనే వ్యక్తిని మైలపల్లి లోవరాజు హత్య చేసినట్టు నక్కపల్లి సీఐ నారాయణరావు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు హత్యకేసు నమోదుచేసి, లోవరాజును శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. రెండు రోజుల క్రితం పెదతీనార్లలో రమణ అనే వ్యక్తి హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఆ కేసు వివరాలను శుక్రవారం సీఐ తెలియజేశారు. రమణకు చెందిన భూమి లోవరాజు ఆధీనంలో ఉందని, అక్రమంగా తమ భూమిని కాజేశాడంటూ రమణ తరచూ లోవరాజుతో గొడవపడేవాడని సీఐ చెప్పారు. బుధవారం కూడా ఈ విషయమై లోవరాజును రమణ నిలదీశాడు. తమ భూమిని కాపాడుకునేందుకు కోర్టుకు వెళ్తానని చెప్పడంతో ఎప్పటికైనా కోర్టుకు వెళ్తాడన్న అక్కసుతో లోవరాజు క్రికెట్ బ్యాట్‌తో రమణ తలపై బలంగా కొట్టాడు. వెంటనే రక్త స్రావమై స్పృహతప్పి పడిపోయిన రమణను కుటుంబ సభ్యులు విశాఖలో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మరణించాడని సీఐ చెప్పారు.ఈ సమావేశంలో ఎస్‌ఐ శిరీష పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నారాయణరావు

దులీప్ ట్రోఫీకి మనోళ్లు ముగ్గురు



హనుమ విహారి



భరత్



రికీబుయ్



శశికాంత్

భరత్, రికీబుయ్, శశికాంత్ ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీకి నలుగురు ఆంధ్రా ఆటగాళ్లు సౌత్‌జోన్ జట్టులో స్థానం సంపాదించారు. టెస్ట్ ఫార్మాట్‌లో జరిగే ఈ ట్రోఫీకి ఎంపికై న జట్టులో ముగ్గురు విశాఖ ఆటగాళ్లు ఉండటం విశేషం. ఈ ట్రోఫీ కోసం దేశంలోని ఆరు జోన్ జట్లు పోటీ పడనున్నాయి. సౌత్ జోన్ జట్టుకు ఆంధ్రా క్రికెటర్ హనుమ విహారి నాయకత్వ బాధ్యతలు వహించనుండగా వికెట్ల వెనుక కె.ఎస్ భరత్ నిలవనున్నాడు. బ్యాటర్‌గా రికీబుయ్ మెరుపులు మెరిపించేందుకు సిద్ధమవుతుండగా.. శశికాంత్ నిప్పులు చెరిగే పేస్‌తో చెలరేగనున్నాడు. జూన్ 28 నుంచి దులీప్‌ట్రోఫీ ప్రారంభం కానుండగా టైటిల్ పోరు జూలై 12 నుంచి 16 వరకు జరగనుంది. నిరుటి ఫైనలిస్ట్‌లు వెస్ట్, సౌత్ జోన్ నేరుగా సెమీస్‌లో తలపడనుండగా మిగిలిన నాలుగు జోన్ జట్లు క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్ లాడి తొలి రెండు జట్లు సెమీస్‌కు అర్హత సాధించనున్నాయి.

జాతీయ జట్టు దిశగా అడుగులేసేందుకు దులీప్ ట్రోఫీ ఆటగాళ్లకు అందివచ్చే అవకాశం. 1961 లోనే ప్రారంభమైన ఈ ఫస్ట్ క్లాస్ క్రికెట్ టోర్నీలో చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఆడిన వారున్నారు. ప్రస్తుతం దక్షిణ జోన్ జట్టుకు ముందుకు నడిపించనున్న హనుమ విహారితో పాటు భరత్, రికీబుయ్ జాతీయ జట్టుకు ఆడిన వారే. శశికాంత్ అండర్–19 వరల్డ్‌కప్ సాధించిన భారత్ జట్టులో సభ్యుడే. దేశంలోని ఆరు జోన్ జట్లు ఈ ట్రోఫీ కోసం పోటీ పడుతుండగా డిఫెండింగ్ చాంపియన్ హోదాలో వెస్ట్ జోన్ బరిలోకి దిగనుంది. ప్రస్తుత సీజన్‌లో రౌండ్ రాబిన్ పద్ధతిలో లీగ్ జరగనుండగా నాకవుట్‌లో టైటిల్ పోరు జరగనుంది. 2014 వరకు ఐదు జోన్ జట్లు నాకవుట్ పద్ధతిలో పోటీపడగా.. తొలినాళ్లలో లీగ్ పద్ధతిలో పోటీ పడేవి. సౌత్, వెస్ట్, ఈస్ట్, నార్త్ జోన్లతో పాటు సెంట్రల్ జోన్ ఆడేది. ప్రస్తుత సీజన్‌లో నార్త్ ఈస్ట్ జోన్‌తో కలిసి ఆరు జట్లు పోటీకి సిద్ధమవుతున్నాయి.

సౌత్‌జోన్‌లో...

ప్రతీ జోన్‌లో రంజీ ట్రోఫీ ఆడిన ఆటగాళ్లను ఆయా రాష్ట్రాల జట్ల నుంచి తీసుకుంటారు. ఇందులో భాగంగానే సౌత్‌జోన్‌లో ఏపీ జట్టుతో పాటు గోవా, హైదరాబాద్, కర్నాటక, కేరళ, తమిళనాడుకు ఆడిన ఆటగాళ్లు ఉన్నారు. సౌత్‌జోన్‌కు ఆంధ్రా ఆటగాడు హనుమ విహారి కెప్టెన్‌గా, మయాంక్ అగర్వాల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. కీపర్లుగా విశాఖ ఆటగాళ్లు రికీబుయ్, భరత్‌లను ఎంపిక చేశారు. రికీబుయ్ టాప్ ఆర్డర్ బ్యాటర్‌గానే సత్తా చాటే అవకాశాలుండగా.. భరత్ వికెట్ల వెనుక నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సాయి సుదర్శన్, సమర్థ్, సుందర్, సచిన్ బెబీ, ప్రదోష్, సాయికిశోర్, కావేరప్ప, వైశాక్, దర్శన్, తిలక్‌లతో పాటు విశాఖకు శశికాంత్ జట్టుకు ఎంపికయ్యారు. వీరిలో చాలామంది ఐపీఎల్ ఆడిన వారున్నారు.

తొలి మూడు సీజన్లలో సౌత్ జోన్ ఫైనలిస్ట్

ట్రోఫీ ప్రారంభమైన 1961–62 సీజన్‌లో సౌత్ జోన్ ఫైనల్ ఆడింది. వరసగా మూడుసార్లు ఫైనల్ లాడినా తొలి రెండు సీజన్లలో రన్నరప్‌గానే సరిపుచ్చింది. ఇక మూడో సారి ఈ రెండు జట్లే ఫైనల్ ఆడగా డ్రాగా ముగియడంతో ఇరు జట్లను విజేతగా ప్రకటించారు. 1965–66 సీజన్‌లో సౌత్‌జోన్ విజేతగా నిలివడమే కాక వరసగా మూడు సార్లు విజేతగా నిలిచి హాట్రిక్ సాధించింది. ఇప్పటి వరకు సౌత్‌జోన్ 11 సార్లు విజేతగా నిలిచింది.